ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 25 నవంబరు 2024 | 5





జన సమారాధనలు

కార్తీకమాసం మూడో ఆదివారం వన సమారాధనలు జనంతో పోటెత్తాయి.. ఎటు చూసినా సందడిగా మారాయి.. మహిళలు ఆటపాటలతో అలరించారు. - వివరాలు 8లో



జీవీఆర్ చౌదరి ర్యాలీలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు తదితరులు.. ఆనందంతో కుమారుడిని ముద్దాడుతున్న తల్లి జగన్మోహిని

రుడా అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

రుడా చైర్మన్‌గా ఆదివారం ఉదయం బొడ్డు వెంకటరమణ చౌదరి ప్రమాణ స్వీకారం చేశారు..ముందుగా కుటుంబంతో రుడా కార్యాలయానికి వెళ్లిన ఆయన అక్కడ ఫైల్‌పై సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు.. ఈ సందర్భంగా తల్లి జగన్మోహిని కుమారుడిని ముద్దు పెట్టుకుని అభినందించారు. అనంతరం బూరుగుపూడి చేరుకుని అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరారు. గ్రామగ్రామాన ఆయనకు ఘన స్వాగతం లభించింది.. కూటమి నాయకులు.. అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.. పూలవాన కురిపించారు.. ర్యాలీగా రాజమహేంద్రవరంలోని చెరుకూరి కల్యాణ మండపానికి చేరుకున్నారు.. మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు హాజరై పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

- 7,8లో

పల్లెకు పండుగేది!

ఇదీ పెరవలి మండలం కానూరు అగ్రహారంలో సీసీ రోడ్డు.. పనులు సాగుతూనే ఉన్నాయి.. ఏదో చేశామా అన్నట్టు చేస్తున్నారు.. ఎంత నాణ్యతగా ఉందనేది అధికారులు పరిశీలించరు.. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. పల్లె పండుగ పనులపై ఒకసారి ఉన్నతాధికారుల దృష్టి పడాల్సిందే మరి..



నత్తనడకన సా..గుతున్న పనులు

కనిపించేదంతా నిజం కాదు... అలాగని చెబుతున్న మాటలు నిజం కాదు.. దీనికి ఇదే ఉదాహరణ. పల్లె పండుగ కార్యక్రమాన్ని గత నెల 2వ తేదీన అట్టహాసంగా ప్రారంభించారు.. గ్రామాల్లో డ్రెయినేజీలు.. సీసీ రోడ్ల అభివృద్ధి పథకం లక్ష్యం.. అయితే అధికారుల లెక్కల ప్రకారం అన్ని చోట్లా పనులు ఆరంభమైపోయాయి.. అయితే క్షేత్రస్థాయిలో చూస్తే మాత్రం చాలా చోట్ల ఇంకా ఆరంభమే కాలేదు. పోనీ ఆరంభమైన చోటయినా వేగంగా సాగుతున్నాయా అంటే అదీ లేదు.. అక్కడా నత్తనకడే.. ఇలా చేస్తే సంక్రాంతికి పనులు పూర్తవడం ప్రశ్నార్థకమే.

- అరకొరగా ఆరంభం
- జిల్లాకు 651 పనులు మంజూరు
- ముందుకు సాగని డ్రైనేజీ నిర్మాణాలు
- రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం
- లెక్కల్లో చూస్తే ఆరంభం
- క్షేత్రస్థాయిలో చూస్తే వెనుకడుగే
- కిందిస్థాయి అధికారుల అలసత్వం
- పనుల్లో వెనుకబడిన తాళ్ళపూడి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగ నాటికి పల్లెలన్నీ సీసీ రోడ్లతో కళకళలాడాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంపై అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులు నత్తనడక సాగుతున్నాయి. ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఒకే రోజు గ్రామసభలు నిర్వహించి పనులకు తీర్మానాలు కూడా చేయించిన సంగతి తెలిసిందే. తర్వాత సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో అక్టోబరు 2 నుంచి పల్లె పండగ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పల్లెల్లోకి వెళ్లి గ్రామసభల్లో తీర్మానం చేసిన పలు పనులకు శంకుస్థాపనలు కూడా చేసిన సంగతి తెలిసిందే. ఇవన్నీ సంక్రాంతి నాటికి పూర్తి కావాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడంలేదు. కొన్ని చోట్ల మొదలైన పనులు వేగవంతంగా జరుగుతుంటే, కొన్ని ప్రాంతాల్లో అసలు ఆరంభమే కాలేదు. కొన్ని సీసీ రోడ్ల నిర్మాణం సాగుతుంటే, ఇంకొన్ని చోట్ల ఇంకా శంకుస్థాపన కూడా చెయ్యని పరిస్థితి. కానీ తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నిత్యం వెంటాడుతున్నారు. పనులు వేగవంతం చేయాలని, డిసెంబరు చివరికి పూర్తి చేయాలని ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు చొరవ చూపుతున్నా కొన్ని సమస్యలు అడ్డంకిగా మారాయి. ఇసుక కొరత ఉంది. పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఇప్పటికే ఎంత ఇసుక కావాలనే ప్రతిపాదన సిద్ధమైంది.కానీ ఇంత వరకు ఎవరు ఏ ర్యాంపు నుంచి ఇసుక తెచ్చుకోవాలనే దానిపై స్పష్టత లేదు. పైగా పరోక్షంగా నామినేషన్ పద్ధతిలో ఈ పనులను ప్రజాప్రతినిధులు... పార్టీ కార్యకర్తలతోనే చేయిస్తున్నారు. కొందరు ముందుగా పెట్టుబడి పెట్టడానికి చొరవ చూపకపోవడం మరో కారణం. కార్యకర్తలు ఓ కాంట్రాక్టరుకు పనులు అప్పగించడం వల్ల ఒక పని తర్వాత మరొకటి చేసుకోవచ్చనే ధోరణి వల్ల కూడా సమస్య ఉంది. అన్ని గ్రామాల్లో ఒకేసారి మొదలైతే డిసెంబరు చివరి వరకూ కూడా అవసరం ఉండదు. క్షేత్రస్థాయిలో అటువంటి పరిస్థితి లేదు.

జిల్లాకు 651 పనులు..

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు మొత్తం 651 పనులు మంజూరయ్యాయి.అవన్నీ సీసీ డ్రెయిన్లే. పంచాయతీరాజ్ శాఖ ద్వారా జరుగుతున్నాయి. గ్రామీణ మంచినీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్) విభాగం ద్వారా రూ.30 కోట్ల విలువైన 100కు పైగా డ్రైన్లు శాంక్షన్ చేశారు. కానీ సాంకేతిక కారణాలతో పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఇక పల్లె పండుగలో భాగంగా ప్రతి గ్రామంలోనూ సీసీ రోడ్లు నిర్మించాలన్నది లక్ష్యం. ప్రాధాన్యతను బట్టి పనులు కేటాయించారు. మొత్తం జిల్లాలో 130 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేయనున్నారు. ఒక్కో కిలో మీటరుకు రూ.50 లక్షల వరకు అంచనా వేశారు. ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం 12.5 అడుగుల రోడ్డు నిర్మించాలి.ఇంకా 1నుంచి 3శాతం వరకు ప్రజాప్రతినిధులు, ప్రజల కోరిక మేరకు నిర్మించవచ్చు. ఏడు అంగుళాల నుంచి 8 అంగుళాల మందం ఉండేలా చూడాలి.కానీ ఈ పనులన్నీ నామినేషన్ పద్ధతిలో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నేతలే చేస్తున్నట్టు సమాచారం.కార్యకర్తల పేర్లతో కాంట్రాక్టర్లు కూడా పనులు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. అనపర్తిలో 50 వర్కులు శాంక్షన్ అయ్యాయి. పనుల నిర్మాణం మొదలైనట్టు అధికారుల లెక్కలు చెప్తున్నాయి. కానీ చాలా పనులు మొదలు కాలేదు.కొన్నింటికి శంకు స్థాపన చేయలేదు. కొన్ని పనులకు సంబంధించి రోడ్లను శుభ్రం చేశారు. కొంత మట్టి వర్కు చేశారు. కంకర లేయర్లు వేశారు. కొన్నిచోట్ల సీసీ రోడ్లు వేశారు. కొన్నిచోట్ల ఆల్టర్నేట్ రోడ్లను ప్రతిపాదించారు. గోపాలపురంలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. కడియంలో నిర్మించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో నాలుగు వర్కులు పూర్తయ్యాయి. పెరవలిలో రెండు గ్రామాల్లో జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం రూరల్‌లో 92 వర్కుల్లో 74 వర్కులే మొదలు కానున్నాయి. మిగతా వర్కులకు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలకు పంపినట్టు సమాచారం.

అధికారుల కాగితాల్లో లెక్కలు

అధికారుల లెక్కల ప్రకారం మండలాల వారీగా..కడియంలో 7 పనులకు అన్నీ మొదలయ్యాయి.కోరుకొండలో 18, రాజమహేంద్రవరం రూరల్‌లో 92 వర్కులకు 74, రాజానగరంలో 32 శాంక్షన్ కాగా అన్నీ మొదలయ్యాయి. రంగం పేటలో 44కి 43, బిక్కవోలులో 70కి 68, ఉండ్రాజవరంలో 54కి 52, గోకవరంలో 48కి 46, నిడదవోలులో 84కి 79, నల్లజర్లలో 38 కి 35, గోపాలపురంలో 12కి 11, చాగల్లులో 9కి 7, పెరవలిలో 42కి 32, దేవరపల్లిలో 18కి 13, కొవ్వూరులో 10కి 13, తాళ్లపూడిలో 17కి7 పనులు మొదలయ్యాయి. సీతానగరం మండలంలో ఒకే ఒక్క పని మంజూరు కాగా ఇంకా మొదలు కాలేదు. తాళ్లపూడి మండలం బాగా వెనుకబడి ఉంది.

పనుల్లో నిర్లక్ష్యం

ఇదీ గోపాలపురం గ్రామంలో వేస్తున్న రోడ్డు.. కనీసం రోడ్డు వెడల్పు చేయకుండా ఇష్టానుసారం వేసేస్తున్నారు.. పక్కనే ఉన్న మొక్కలు తీసి రోడ్డు వెడల్పు చేస్తే బాగుండేది.. కానీ పాత రోడ్డు ఎంత ఉందో అంతే వేశారు.. ఇలా గ్రామాల్లో అభివృద్ధికి నిధులు విడుదల చేసినా పనులు మాత్రం నిర్లక్ష్యంగా సాగుతున్నాయి..అయినా పట్టించుకునేవారే లేరు.. క్వాలిటీ కంట్రోల్ అధికారులు 20 రోజుల తరువాత చూస్తారట..





పంచాయతీల్లో అవినీతి!

ఇష్టానుసారంగా పోస్ట్ శాంక్షన్ ఆర్డర్స్

- వదలని మామూళ్ల మత్తు
- లంచమిస్తేనే జీతాలు
- 300 పంచాయతీల్లో ఇదీ తీరు
- జిల్లా సిబ్బంది 10 వేలు
- వసూళ్లు రూ.1.50 కోట్లు?
- కిందిస్థాయి సిబ్బంది గగ్గోలు
- ఇష్టానుసారం నియామకాలు
- అయినా పట్టని అధికారులు
- నేటికీ తేలని అసలు లెక్క

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేటికీ అంతా మా ఇష్టం అంటున్నారు..అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారే తప్ప..కనీసం కన్నెత్తి చూడడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు అవుతున్నా అధికారుల తీరు నేటికీ గత ప్రభుత్వంలో ఉన్నట్టే ఉన్నారు. తీరు మారలేదు.. అవినీతి ఆగలేదు. యథేచ్ఛగా దోపిడీ సాగుతూనే ఉంది. పంచాయతీల్లో ఇదీ మరీ ఎక్కువగా ఉంది. జిల్లాల విభజన జరిగినా అవినీతిని రూపుమాపడం.. అక్రమాలను అడ్డుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. పంచాయతీల్లో సిబ్బందికి పోస్ట్ శాంక్షన్ ఆర్డర్ లేకుండానే జీతాలు వెళ్లిపోతున్నా ఎందుకో మరీ నేటికీ ఏమీ తెలియనట్టు ఉన్నారు..

రెండేళ్లకోసారి దోపిడీ..

ఏ పంచాయతీలో అయినా పోస్ట్ శాంక్షన్ ఆర్డరు ఉంటేనే పంచాయతీ సిబ్బందికి జీతాలు చెల్లించాలి.ప్రతి రెండేళ్లకోసారి జిల్లా పంచాయతీ అధికారులు రెన్యువల్ చేస్తారు. జిల్లాలో చాలా పంచాయతీల్లో ఇవేమి లేకుండానే చెల్లింపులు చేస్తున్నారు.అయితే ఆర్డరు లేని సిబ్బంది తీరు ఇలా ఉంటే.. ఆర్డరు ఉన్న సిబ్బందీ ఆమ్యామ్యా చెల్లించాల్సిందే.ఆర్డరు రెన్యువల్ కావాలంటే ప్రతి కార్మికుడు(సిబ్బంది)రూ.1500 నుంచి రూ.3 వేల వరకు చెల్లించాలి. దీనిని బట్టే ప్రతి సంవత్సరం జీతాల పెంపుదల ఉంటుంది. ఒక యూనియన్ నాయకుడు సిబ్బంది వద్ద నుంచి వసూలు చేసి డీఎల్‌పీవో, జిల్లా పంచాయతీ అధికారి, కార్యాలయ సిబ్బందికి చెల్లిస్తారు. ఇదంతా ఆయా పంచాయతీ కార్యదర్శుల సిఫారసు మేరకే జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధిలోని ఒక పంచాయతీలో కార్యాలయ సిబ్బంది నుంచి రూ.1000, మిగిలిన పారిశుధ్య, తదితర సిబ్బంది వద్ద నుంచి రూ.3వేల వరకు సదరు కార్మిక నాయకులు వసూలు చేసినట్టు సమాచారం. జిల్లావ్యాప్తంగా 300 పంచాయతీల్లో సుమారు 10 వేల మంది పనిచేస్తున్నారు. సరాసరిన ఒక్కొక్కరి నుంచి రూ.1500 వసూలు చేసినట్టు లెక్కవేసినా రూ.1.50 కోట్లు అక్రమ వసూళ్లు సాగినట్టే. పోస్టు శాంక్షన్ వ్యవహారంలో సొమ్ములు వసూళ్లపై జిల్లా పంచాయతీ కార్యాలయం అధికారులను వివరణ కోరగా పొంతన లేని సమాధానం చెబుతున్నారు. డీపీవో ఫోన్‌లోనూ అందుబాటులోకి రావడంలేదు.జిల్లాలోని 300 పంచాయతీల్లో ఎంత మంది పంచాయతీ కార్మికుల జీతాలకు సంబంధించి పోస్టుశాంక్షన్ ఆర్డర్లు ఇచ్చారన్న దానిపై మాటదాటవేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అధికారులు సిబ్బంది లెక్క తేల్చకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అవసరాలను బట్టి పంచాయతీలలో సిబ్బంది నియామకాలు చేపట్టవచ్చుగాని వారిని ఏ స్థానంలో నియమించారో ఆ స్థానంలో పనిచేయించాలి. ఎలాంటి క్వాలిఫికేషన్ లేకుండా, అర్హతతో సంబంధంలేకుండా పోస్టులను సృష్టించి అర్హత లేకపోయినా నియామకాలు చేపట్టారు. కొంత మంది అధికారులైతే సిబ్బందిని వ్యక్తిగత అవసరాలకు (డ్రైవర్లు)గా వాడుకుంటూ పంచాయతీ నుంచి సీఎఫ్‌ఎంఎస్ ద్వారా జీతాలు చెల్లించిన సంఘటనలు ఉన్నట్టు సమాచారం. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు.పంచాయతీ సిబ్బంది నివేదికలు బయటపెడితే పంచాయతీ అధికారుల అవకతవకలు బయటపడతాయని పలువురు మాజీ ప్రజాప్రతినిధులుబహిరంగంగానే చెబుతున్నారు

ఇష్టానుసారం ఇచ్చేసినా నివేదికల్లేవ్!

గత ప్రభుత్వంలో పంచాయతీల్లో అక్రమ నియామకాలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. పంచాయతీల్లో "ఇష్టానుసారం ఇచ్చేశారు" శీర్షికన ఈ నెల 8వ తేదీన "ఆంధ్రజ్యోతి"లో కథనం ప్రచురితమైంది. నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి నివేదిక పంపాలంటూ జిల్లా అధికారులను కోరారు. దీంతో జిల్లాలో ఉన్న పంచాయతీ సిబ్బంది సమాచారాన్ని సేకరిస్తున్నారు. డీపీవో ఆదేశాల మేరకు సిబ్బంది పేరు, హోదా,విధుల్లో ఎప్పుడు చేరాడు, డీపీవో జారీ చేసిన జాయినింగ్ ఆర్డరు (పోస్ట్ శాంక్షన్ ఆర్డర్) ఉందా,ఎంత జీతం తీసుకుంటున్నాడు, సీఎఫ్ ఎంఎస్ ఐడీ, ఫోన్ నంబరు తదితర అంశాలతో కూడిన సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శుల నుంచి ఈవోపీఆర్డీ సేకరిస్తున్నారు. గత 10 రోజులుగా వివరాలు సేకరిస్తున్నాం అంటున్నారే తప్ప నివేదికను బయటకు ఇవ్వడం లేదు. పంచాయతీల నుంచి నివేదికలు తీసుకున్నామని ఈ నివేదిక బయటకు ఇవ్వడానికి వీల్లేదని నేరుగా జిల్లా కలెక్టరుకు సమర్పించామని రూరల్ మండల పంచాయతీ విస్తరణాధికారి ఆర్మ్‌స్ట్రాంగ్ చెబుతున్నారు.

చంటి బిడ్డ మృతి.. బంధువుల ఆందోళన
రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రిలో ఘటన 7

చాగల్లు ఐఎంఎల్ డిపో పరిశీలన
డిపోలో మౌలిక వసతులపై ఆరా 8

పెళ్లయిన రెండేళ్లకే వివాహిత మృతి

అనుమానాస్పద మృతిగా కేసు

గోపాలపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. సద్దొండ గ్రామ పరిధిలో ఉన్న గోపవరం గ్రామానికి చెందిన అన్నెం వీర హారిక అదే గ్రామానికి చెందిన వరుసకు బావ అయిన అన్నెం మోషేను రెండేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకుంది. ఈ దంపతులకు ఏడాది పాప ఉంది. ఆదివారం ఉదయం ఎంత సేపటికి ఇంట్లో నుంచి హారిక బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వారికి అనుమానం వచ్చి తలుపులు తీయగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయినట్టు గుర్తించారు. ఇటీవల పుట్టింటి వారు ఆమెను పట్టించుకోవడంలేదని మనోవేదనకు గురై శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చీర పాల్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు చెబుతున్నారు. మండల తహశీల్దార్ సీహెచ్.విద్యాపతి ఆదివారం శవ పంచనామా చేశారు. మృతురాలి తల్లి పేరం దుర్గ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సతీష్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



నిడదవోలులో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ ర్యాలీలో టీచర్ల నినాదాలు

టీచర్లు నిరంతర అధ్యయనం చేయాలి

యూటీఎఫ్ కౌన్సిల్ స్వర్ణోత్సవ సభలో ఎమ్మెల్సీ ఐవీఆర్

నిడదవోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమ సమాజాన్ని నిర్మించే పౌరులను తయారు చేయాలంటే ఉపాధ్యాయులు అభ్యుదయంగా ఆలోచిస్తూ సాంకేతిక దృక్పథంతో బోధించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు అన్నారు. నిడదవోలు లయన్స్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ నూతన కౌన్సిల్ స్వర్ణోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రతి విషయంపై నిరంతర అధ్యయనం చేయాలన్నారు. 50 ఏళ్ళ యూటీఎఫ్ ఉద్యమ చరిత్రలో ఎన్నో విజయాలు ఉన్నాయన్నారు. విద్యార్థులపై పనిగంటల పెంపు భారాన్ని విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బీ గోపీమూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ హక్కులు బాధ్యతలు యూటీఎఫ్ సంఘానికి రెండు కళ్లు అన్నారు.యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ మాట్లాడుతూ కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.విజేతలైన ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏ షరీఫ్, కె.వేంకటేశ్వరరావు, పార్థసారథి, ఈవీవీఎస్ ప్రసాద్, శంకరుడు, ఎం.విజయగౌరి, ఐ.రాంబాబు పాల్గొన్నారు.

సత్యదేవుడి సన్నిధి.. భక్తజనసంద్రం


అన్నవరంలో స్వామివారి దర్శనంకోసం క్యూలైన్‌లో వేచియున్న భక్తులు


అన్నవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పర్వదినాలు ముగింపు దశకు చేరనుండడంతో సత్యదేవుడి సన్నిధిలో రద్దీ క్రమేపీ పెరుగుతుంది. ఆదివారం సెలవుదినం కావడంతో స్వామివారి సన్నిధి భక్తజన సంద్రమైంది. ఆదివారం ఒక్కరోజు 8893 వ్రతాలు జరగ్గా వివిధ విభాగాల ద్వారా రూ.90లక్షల ఆదాయం సమకూరింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు గంటలనుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించినా ఉదయం 9గంటల నుంచి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఈవో రామచంద్రమోహన్ క్యూలైన్‌ల వద్ద నుంచి త్వరితగతిన భక్తులు దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. సత్యదేవా నిత్యాన్నదాన పథకం ద్వారా 30వేలమందికి ఉచిత పులిహోర దద్దోజన ప్రసాదం వితరణ చేశారు. 80వేలమంది స్వామిని దర్శించుకున్నారు.

- ఒక్కరోజే 8893 వ్రతాలు
- రూ.90 లక్షల ఆదాయం

నేడు, రేపు రద్దీ

కార్తీక చివరి సోమవారం, మంగళవారం బహుళ ఏకాదశి పర్వదనం కావడంతో ఈ రెండు రోజులు స్వామివారి ఆలయంలో రద్దీకొనసాగనుంది. దీనికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై దృష్టిసారించారు.

తెరచాటు సూరీడు..



ఎత్తైన కొండల నడుమ నల్లటి మబ్బుల మధ్యలో ఎర్రటి సూరీడు అస్తమించే ఈ సుందర దృశ్యం కట్టిపడేస్తోంది కదూ.. సత్యదేవుడి గిరిప్రదక్షిణ మార్గంలో ఆవిష్కృతమైన ఈ చిత్రం ప్రకృతి ప్రేమికులను రంజింపచేస్తోంది. దీన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్‌మనిపించింది. అన్నవరం/(ఆంధ్రజ్యోతి)

పలు రైళ్ల రద్దు

సామర్లకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో తాడి-దువ్వాడ రైల్వే సెక్షన్‌లో చేపడుతున్న నాన్‌ఇంటర్ లాకింగ్ పనుల దృష్ట్యా విజయవాడ నుంచి సామర్లకోట జంక్షన్ మీదుగా విశాఖకు రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వేఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సామర్లకోట రైల్వే ఉన్నతాధికారి నుంచి ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది.

- 12717 నెంబరుగల విశాఖపట్నం-విజయవాడ మధ్య నడిచే రైలును ఈనెల 25న రద్దు చేశారు.
- 12718 నెంబరు గల విజయవాడ -విశాఖపట్నం మధ్య నడిచే రైలును ఈనెల 25న రద్దు చేశారు.
- 17267 నెంబరు గల కాకినాడ-విశాఖపట్నం, 17268 నెంబరుగల విశాఖపట్నం-విజయవాడ మధ్య నడిచే రైళ్లను ఈనెల 25న రద్దు చేశారు.
- 17239, 17240 నెంబర్లుగల గుంటూరు-విశాఖపట్నం-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు 25న రద్దు చేశారు.
- 17267, 17268 నెంబర్లు గల కాకినాడ పోర్టు-విశాఖ-కాకినాడ పోర్టు మధ్య రాకపోకలు సాగించే పాస్ట్ పాసింజర్లు 25న రద్దు చేశారు.
- 07466, 07467 నెంబర్లు గల రాజమహేంద్రవరం-విశాఖ-రాజమహేంద్రవరం మధ్య రాకపోకలు సాగించే పాసింజర్ రైళ్లు 25న రద్దు చేశారు.

ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా తమ ప్రయాణాలను కొనసాగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

గండి పోశమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

దేవీపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండల పరిధిలో ఉన్న మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారి దర్శనాలు ఇటీవల అధికారులు పునః ప్రారంభించడంతో ఆదివారం వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్తీకమాసం కావడంతో అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ పెరిగింది.


భక్తులకు దర్శనమిస్తున్న గండిపోశమ్మ తల్లి

ఉత్కంఠభరితంగా ఉమ్మడి జిల్లా బాస్కెట్ పోటీలు

పిఠాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని పిఠాపురంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పురుషులు, మహిళల చాంపియన్‌షిప్ పోటీలు రెండు రోజులుగా ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం, రాత్రి కూడా ఈ పోటీలు జరిగాయి. మహిళలు, పురుషుల జట్లు సెమీఫైనల్‌కి చేరాయి. అర్ధరాత్రి వరకూ ఈ పోటీలు జరిగ్గా ఈ పోటీలను క్రీడాకారులు, స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.


బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల విజేత 'తూర్పు'

కాకినాడ అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి); రెండురోజులుగా కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి రగ్బీపోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. పోటీల్లో విజేతగా ఉమ్మడి జిల్లా బాలికల జట్టు నిలిచింది. గుంటూరు రెండోస్థానం దక్కించుకోగా ప్రకాశం మూడోస్థానం నిలిచింది. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి అధ్యక్షతన జరిగిన సభలో విజేతలకు మెమెంలోలు అందజేశారు. వివిధ జిల్లాలనుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డిసెంబరులో రాంచిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు జార్జి తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రామాంజనేయులు, పరిశీలకుడు గణేష్, నాగేంద్రకుమార్, రమణరాజు, వి.రవిరాజు, కె.నూకరాజు, సునీల్ పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి బాలికల రగ్బీ పోటీల్లో విజేతగా నిలిచిన తూర్పు జట్టు

కోటసత్తెమ్మకు పూజలు



నిడదవోలు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ తల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి విశేష దర్శనం, నిత్యదర్శనం చేపట్టారు. అమ్మవారికి క్షీర నివేదన, మహానివేదన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


రుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బీవీఆర్ చౌదరితో కుటుంబీకులు, వెంకటరమణచౌదరిని అభినందిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, దాట్ల సుబ్బరాజు

రుడా అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- రానున్న 40 ఏళ్లు దృష్టిలో పెట్టుకుని చేస్తా
- గత అక్రమాలపై దృష్టిపెడతా
- రుడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారంలో బొడ్డు వెంకట రమణ చౌదరి


బీవీఆర్ చౌదరిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రానున్న 40ఏళ్లలో రాజమహేంద్రవరం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించడమే నా ప్రధాన లక్ష్యమని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం చెరుకూరి కళ్యాణ మండపంలో ఆది వారం రుడా చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. తొలుత బొడ్డు వెంకట రమణ చౌదరి తండ్రి బొడ్డు భాస్కరరామారావు చిత్రపటానికి పూలమాల వేసి బొడ్డు కుటుంబీకులు తల్లి జగన్నేహిని, సతీమణి సురేఖ, ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. అనంతరం వెంకటరమణచౌదరి మా ట్లాడుతూ నాకు రుడా చైర్మన్ పదవి ఇచ్చిన సీ ఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాజానగరం టీడీపీ శ్రేణులవల్లనే తనకు ఈ పదవి వచ్చిందన్నారు. అభివృద్ధిలో సమప్రాధాన్యం ఇస్తామన్నారు. రాజమహేంద్రవరం నగరం వేగంగా అభివృద్ధి చెందు తూ ఉన్నతంగా ఉండాలన్నారు. ఇందులో తమవంతు పాత్ర పోషిస్తామన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు ఇప్పటికే అధికారులతో సమాలో చన చేస్తున్నామన్నారు. రుడా పరంగా కొత్త ప్రాజెక్టులు వస్తాయన్నారు. రుడా నుంచి అభివృద్ధి వైపు కార్యకలాపాలు నిర్వహిస్తూనే మరోవైపు గత పాలకుల అవినీతి అక్రమాలపై దృష్టిపెడతామన్నారు. అందరి సహకారం సమన్వయంతో ముందుకు సాగుతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి సౌమ్యులని కానీ గత పాలకుల లెక్కలు తేలుస్తారని చెప్పారు. కూటమిలో చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నప్పటికీ తామంతా చంద్రబాబుకోసం రాష్ట్ర శ్రేయస్సు కోసం తగ్గి కలిసికట్టుగా వెళతామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ హాజరై అభినందనలు తెలిపారు. తొలుత బొడ్డుకు ఆదిరెడ్డి వాసు పెయింటింగ్ బహూకరించారు. తొలుత బొడ్డు వెంకటరమణచౌదరి రాజానగరం నియోజకవర్గం నుంచి భారీ ఊరేగింపు నిర్వహించారు. రూరల్ గ్రామాల గుండా రాజమహేంద్రవరం చేరుకున్నారు. బొడ్డుకు ఆయా గ్రామాల్లో ఘనస్వాగతం పలికారు. అనంతరం భారీ స్థాయిలో చెరుకూరి కళ్యాణ మండపానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిరాజు, నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ళ జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, మాజీ మంత్రి పీతల సుజాత, టీడీపీ సీనియర్ నేత గన్నికృష్ణ, నీరుకొండ వీరన్నచౌదరి, మాజీ ఎమ్మెల్యే చిన్నంబాబు రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జనసేన రాజమహేంద్రవరం ఇన్ చార్జి అనుశ్రీ సత్యనారాయణ, పరిమి వాసు, ఇతర ముఖ్యనాయకులు బొడ్డుకు అభినందనలు తెలిపారు.

కార్మిక నాయకుడు గల్లా రాము మృతి



అమలాపురం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమలాపురానికి చెందిన కార్మిక నాయకుడు గల్లా రాము(83) ఆదివారం మృతి చెందారు. ఆది నుంచి కార్మిక ఉద్యమాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అభిమానిగా ముద్ర వేసుకున్న రాము పార్టీ ఆవిర్భావం సమయంలో అమలాపురం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఎన్టీఆర్ కోరగా ఆయన సున్నితంగా తిరస్కరించారు. అప్పటికే పేరొందిన దూలం నాగేశ్వరరావు పేరును రాము సూచించారు. నాగేశ్వరరావు కూడా తిరస్కరించడంతో 1983లో మెట్ల సత్యనారాయణ టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. టీడీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా ఆయన రెండు దశాబ్దాలు పనిచేశారు. అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి సిఫార్సుతో రైల్వే యూజర్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. రాముకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విచారణ అధికారిని నియమించాం : డీఈవో

కాకినాడరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాధపురం అన్నమ్మ ఘాటీ జీఎంసీ బాలయోగి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనపై విచారణ అధికారిని నియమించినట్లు డీఈవో రమేష్ తెలిపారు. విచారణ అనంతరం నివేదిక అందిన వెంటనే ఆ ఉపాధ్యాయుడిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

శోభాయమానంగా ద్రాక్షారామ భీమేశ్వరాలయం

- రేపు 61వ కార్తీకదీపారాధన మహోత్సవం


సప్తగోదావరినది మధ్యలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి భారీ కటౌట్, సెట్టింగ్

ద్రాక్షారామ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకదీపారాధన మహోత్సవానికి ద్రాక్షారామ శోభాయమానంగా ముస్తాబు అయింది. ద్రాక్షారామలో ప్రసన్నాంజనేయ బాలభక్తసమాజం ఆధ్వర్యంలో రేపు 61వ కార్తీక దీపారాధన మహోత్సవం జరుగనుంది. కార్తీక మాసం ఆఖరు మంగళవారం భీమేశ్వరస్వామివారి ఆలయబాహ్య ప్రాంగణంలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయంవద్ద కార్తీకదీపారాధన వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. 61వ కార్తీకదీపారాధనకు ఏర్పాట్లు పూర్తి చేశారు.ద్రాక్షారామ భీమేశ్వరాలయ బాహ్య ప్రాంగణం, సప్తగోదావరి నదిఒడ్డున, బోసు బొమ్మసెంటర్‌లో మిరుమిట్లు గొలిపే విద్యుత్, ఎల్ఈడీ దీపాల సెట్టింగ్‌లతో అలంకరించారు. సప్తగోదావరినది మధ్యలో ఆంజనేయస్వామిభారీ కటౌట్ ఏర్పాటుచేశారు. సాంస్కృతిక కార్యక్రమాల వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మంగళవారం ఉదయం 6 గంటలకు ప్రసన్నాంజనేయస్వామికి విశేష లక్షతులసి పూజ, పంచామృత అభిషేకం నిర్వహిస్తారు. రాష్ట్ర కార్మికశాఖ, పరిశ్రమలుశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు పూజాధికాల్లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ఉష్ట్రవాహనంపై స్వామివారి నగరోత్సవం జరుగుతుంది. రాజ్యసభసభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ నగరోత్సవం ప్రారంభిస్తారు. 4నుంచి 5 గంటల వరకు అక్కిరెడ్డి అబ్బు బృందంచే భజన కాలక్షేపం జరుగుతుంది. సాయంత్రం 5.24 గంటలకు అఖండ దీపారాధనను ప్రసన్నాంజేయస్వామి బాలభక్త సమాజం గౌరశాధ్యక్షుడు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు ప్రారంభిస్తారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

తదుపరి శుభమ్ ఈవెంట్స్‌చే సినీ గాయకులు శ్రీలలిత, సత్య, సిద్ధూరాక్‌స్టార్‌లచే సినీ సంగీత విభావరి జరుగుతుంది. జబర్దస్త్ బృందం రైజింగ్‌రాజు, దొరబాబు, హరిత, రాజమౌళిచే హాస్య సన్నివేశాలు ప్రదర్శన నిర్వహిస్తారు. అనంతరం దవులూరి శ్రీనివాస్‌చే బాణాసంచా కాల్పులు ఉంటాయి. తదుపరి ఉమాశ్రీవాణి కళానికేతన్ వారిచే రామాంజనేయ యుద్ధం వార్‌సీను, రాజనర్తకి నాటకం జరుగుతాయి. రామచంద్రపురం డీఎస్పీ పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు.


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ప్రత్యేక దర్శనం క్యూలైనులో భక్తులు

భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఆఖరు కార్తీక ఆదివారం భక్తులరద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. క్యూలైన్ల ద్వారా భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అశ్వత్థనారాయణ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉసిరిక వృక్షంవద్ద కార్తీకదీపాలు వెలిగించారు. సామూహిక అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ అన్నదాన భవనంలో అన్నదానం నిర్వహించారు. పైండావారి సత్రంలో యథావిధిగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీ పర్యవేక్షణలో భక్తులకు సేవలు అందించారు. ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పాపికొండలకు 12 బోట్లు

దేవీపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నలుమూలల నుంచి వందలాది మంది పాపికొండలు అందాలు తిలకించేందుకు తరలివచ్చారు. మండల పరిధిలో ఉన్న పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి పరివాహక ప్రాంతాలమీదుగా ప్రకృతి ప్రేమికులు 12బోట్లలో 850మంది పర్యాటకులు పాపికొండలు మీదుగా పేరంటాలపల్లి వెళ్లారు. రెండు గంటలపాటు పాపికొండల్లో సందడి చేశారు. అనంతరం సాయంత్రం 5గంటలకు పోశమ్మగండి చేరుకున్నారు. భారీగా పర్యాటకులు హాజరుకావడంతో సందడి నెలకొంది. ముందుగా గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని పాపికొండలు వెళ్లారు.


పాపికొండలకు వెలుతున్న బోటు


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.చిరంజీవినీకుమారి

సాహిత్యానికి అనుబంధం కథ

- డాక్టర్ పి.చిరంజీవినీకుమారి

కాకినాడరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కథ అనేది చరిత్రకు, జీవితానికి, సాహిత్యానికి అనుబంధం వంటిదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి అన్నారు. ఐడీయల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌లో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కథ ఏమిటి ఎందుకు ఎలా అనే అంశంపై ఒక సమాలోచన కార్యక్రమాన్ని నిర్వహించారు. సభాధ్యక్షురాలు డాక్టర్ పి.చిరంజీవినీకుమారి మాట్లాడుతూ మనిషి పుట్టగానే కథ వచ్చింది, బాలసాహిత్యం నుంచి అద్భుత కథలు వచ్చాయన్నారు. అనంతరం నండూరి రాజగోపాల్ మాట్లాడుతూ పెద్దల నుంచి విన్నదే కథ అని, అది జీవితంలో ఒక భాగం అయిందని పేర్కొన్నారు. అనంతరం వాడ్రేవు వీరలక్ష్మి, మహమ్మద్ ఖదీర్‌బాబు ప్రసంగించారు. మణిబాబు, వీరబాబు, సత్యనారాయణ, వెంకటనరసింహశాస్త్రి, శైలజ, చింతపల్లి సుబ్బారావు, స్టీవెన్‌రాజు పాల్గొన్నారు.

చంటిబిడ్డ మృతిపై బంధువుల ఆందోళన

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నందం గనిరాజు సెంటర్ సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చంటిబిడ్డ మృతి చెందిన సంఘటనపై బాధిత బంధువులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే ఏలేశ్వరం పెద్దవీధికి చెందిన బండి లక్ష్మణ్ భార్య డెలివరీ నిమిత్తం అక్టోబరు 30న ఆసుపత్రిలో చేరింది. ఆమెకు కవల పిల్లలు పుట్టారు. ఇద్దరిలో ఒక పాపకు ఆరోగ్యం బాగోలేదని.. అప్పట్నుంచి ఎన్ఐసీయూలో పెట్టి చికిత్స అందిస్తున్నారు. అయితే శనివారం రాత్రి బేబి మృతి చెందిందని వైద్యులు చెప్పడంతో లక్ష్మణ్ ఆవేదనతో ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగాడు. తమవల్ల కాదు అంటే వేరొక హాస్పటల్‌కు పాపను తీసుకువెళ్లి చికిత్స చేయించుకునేవారమని.. చెప్పకుండా చంపేశారని ఆసుపత్రి వర్గాల తీరుపై మండిపడ్డారు. అటుపై బేబి మృతదేహాన్ని తీసుకుని వెళ్లిపోయారు.


ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న చంటిబిడ్డ బంధువులు

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో టీటీ అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు ఆదివారం రాజమహేంద్రవరం గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో నిర్వహించారు. పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రదేశాల నుంచి అనేకమంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లాధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, సీనియర్ క్రీడాకారుడు పత్రి సారంగధరరావు ప్రారంభించారు. పోటీల్లో పురుషుల జట్టుగా టి.ప్రభాత్ సాయి, బూర వినయ్, సాయి జోషిత్, మిరియాల చిట్టిబాబు, ఎస్.సూర్య ప్రకాష్, లోహిత్ సూర్య ఎంపికయ్యారు. మహిళల జట్టులో జి.సిరిపావని, పత్రి లక్ష్మి, వై.వైష్ణవి సూర్య, చార్వి పల్లుణ్, జి.తాన్యశ్రీ ఎంపికయ్యారు. అండర్-15 బాలుర విభాగంలో ఎస్.లోహిత్ సూర్య, ఎస్.మోహిత్, శ్రీకపిష్, సాయికిశోర్, డి.ఉదయకుమార్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో జి.తాన్యశ్రీ, కె.శరణ్యరెడ్డి, ఎ.శివాని, కె.కావ్య ఎంపికయ్యారు. వీరందరూ డిసెంబరు 20 నుంచి 22 వరకు కాకినాడలో జరగబోయే అంతర్ జిల్లా స్టేట్ టేబుల్‌టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని కోశాధికారి వీటీవీ సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, పీవీవీ సత్యనారాయణరావు, ఎస్ఎస్.ఫల్గుణ్, వి.కిరణ్, ఎ.శ్రీకాంత్, పీఈటీ బాపిరాజు, ఫ్యూచర్ కిడ్స్ కోచ్ అమృత, కె.వీరబాబు పాల్గొన్నారు.

ఇంటర్నల్ చెస్ పోటీలకు 120 మంది

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం కాల్‌ఫ్యూజన్ చెస్ అకాడమీలో ఆదివారం చెస్ క్రీడాకారులకు జిల్లాస్థాయిలో ఇంటర్నల్ చెస్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో నాలుగేళ్ల నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులు సుమారు 120 మంది పాల్గొన్నారని అకాడమీ డైరెక్టర్ కం కోచ్ విత్తనాల కుమార్ తెలిపారు. క్రీడాకారులకు వారి స్థాయిని బట్టి బహుమతులు అందజేశామని, కేటగిరీ ఏ లో శ్రీనికేష్, తక్షిల్, సుజయ్ విజేతలుగా నిలిచారన్నారు.

రిటైర్డ్ జ్యుడీషియల్ ఎంప్లాయీస్ సమావేశం


సమావేశంలో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సునీత

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విశ్రాంతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పాటుపడతానని జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి గంధం సునీత అన్నారు. రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా జ్యుడీషియల్ ఎంప్లాయీస్ సంఘ ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు తవ్వా వీరేంద్రనాథ్, విశ్రాంతి ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సంపత్‌కుమార్, సుధాకర్, వరదరాజు, ఎం.నాగేశ్వరరావు, ఏఆర్‌కె రాజు, నాగభాస్కర్, విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత అవధానం

రాజమహేంద్రవరం కల్చరల్ నవంబర్24 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ ఘాట్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన సంగీత అవధానం శ్రోతలను ఆకట్టుకుంది. ప్రసంగ తరింగిణి 34వ వార్షికోత్సవం, సంస్థ 244వ సాహిత్య కార్యక్రమం శీమకుర్తి రామరాజు, సుశీలమ్మ దంపతుల స్మారకార్థం నవావధాని మీగడ రామలింగస్వామి సంగీత అవధానం చేశారు. ప్రబల సుబ్రహ్మణ్యశర్మ సంధాతగా వ్యవహరించారు. ఆర్‌వీవీ.గోపాలాచార్యులు, జోరాశర్మ, శ్రీపాద సీతామహలక్ష్మి, నూజిళ్ళ సూరిబాబు, సవితాల సుబ్రహ్మణ్య శర్మ, బీహెచ్ రమాదేవి, ప్రబల శ్రీవల్లులు, వివిధ సంగీత, సాహిత్య ప్రక్రియల్లో తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించి సంగీత ప్రియులను పరవశింపజేశారు. దువ్వూరి పార్వతి మల్లికార్జునరావు ప్రార్థన చేశారు. జ్ఞాన సరస్వతి పీఠం తరఫున తోట సుబ్బారావు సత్కరించారు. కార్యక్రమంలో బిక్కిన రామమనోహర్, బత్తుల సాయిబాబు, కాల్నాభట్ల సత్యనారాయణ, డీవీ.హనుమంతరావు దంపతులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి: పీడీఎస్‌యూ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్‌కు ఎదురు చూస్తున్నారన్నారు.

మోడీ పాలనకు మహారాష్ట్ర, జార్ఖండ్ ఫలితాలే తార్కాణం

అనపర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దేశంలో మోడీ పాలనకు మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలే తార్కాణమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తిలోని ఎన్డీయే కూటమి కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో మహారాష్ట్ర ఫలితంపై కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ముందుగా ఆయన కేక్ కట్ చేయగా పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మాదిరిగా మహారాష్ట్రలో ప్రతిపక్ష హోదా కూడా లేకపోయిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి చేసిన అవినీతి అమెరికా వరకు పాకిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శివరామకృష్ణంరాజు, జనసేన ఇన్‌చార్జి రావాడ నాగు, టీడీపీ జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు తదితరులతో పాటు నియోజకవర్గ ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు

కడియం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా ఏఎస్పీ ఎస్‌బీఎం మురళీకృష్ణను ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అన్నందేవుల చంటి, ప్రత్తిపాటి రామారావు చౌదరి మర్యాద పూర్వకంగా కలిసారు. ఆయనకు పూలకిరీటం పెట్టి, భారీ గజమాలతో సత్కరించారు. ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టినందుకు అభినందనలు తెలిపారు.


మురళీకృష్ణను సత్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు చంటి, పార్లమెంట్ నాయకుడు రామారావు చౌదరి

రోడ్డుపై బ్రాందీ షాపు ఏర్పాటు చేస్తే ఊరుకోం

రాజానగరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారిపై బ్రాందీ షాపు ఏర్పాటు చేస్తే ఊరుకోమని ఎంపీటీసీ మాజీ సభ్యులు నాతిపాం జాన్ ఆధ్వర్యంలో వెలుగుబంద గ్రామస్తులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. రాజానగరం నుంచి కొత్త వెలుగుబంద పోవు రహదారిని ఆనుకుని బ్రాందీ షాపు నిర్వహణకు ఇటీవల పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ముందు నుంచి హెచ్చరించినప్పటికీ పట్టించుకోకుండా నిర్మాణ పనులు పూర్తి చేసేశారు. సోమవారం దుకాణం ప్రారంభిస్తున్నట్లుగా సమాచారం అందడంతో గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని పనులు అడ్డుకున్నారు. రహదారిని ఆనుకుని కాకుండా లోపలకు ఏర్పాటు చేస్తే అభ్యంతరం లేదని గ్రామస్తులు చెప్పారు. నన్నయ, గైట్, జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలు తమ గ్రామం చుట్టూ ఉన్నప్పటికీ కనీసం బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజలంతా ఈ రహదారి మీదుగా వెళ్లి, రావాల్సి ఉంటుందన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఎక్సైజ్ పోలీసులు దృష్టికి తీసుకెళ్లామని, గ్రామస్తుల ఆమోదం ఉంటే తప్ప బ్రాందీ షాపు ఏర్పాటు చేయవద్దని నిర్వాహకులకు సూచించినట్లు పోలీసులు బదులిచ్చారన్నారు.

భక్తి శ్రద్ధలతో వాసవీమాతకు సారె

గోకవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వాసవి కన్యకా పరమేశ్వరికి సారె సమర్పణ ఆదివారం వైభవంగా జరిగింది. గోకవరంలోని అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ముందుగా పూజలు చేసిన అనంతరం సారె సమర్పించారు. కార్తీకమాసం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో రకరకాల పిండి వంటలు, స్వీట్లతో అమ్మవారికి సారె సమర్పించారు. ఆర్యవైశ్య సంఘ మహిళలు కల్యాణ మండపం వద్ద నుంచి ప్రధాన రహదారి మీదుగా దేవిచౌక్, పాత బస్టాండ్ వరకు జై వాసవి...జైజై వాసవి అని హోరెత్తించారు.


వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పిండి వంటలతో సారె సమర్పించిన భక్తులు

ఐఎంఎల్ డిపో పరిశీలన

చాగల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చాగల్లులోని ఏపీఎస్‌బీసీఎల్ ఐఎంఎల్ డిపోను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ (కాకినాడ) చైతన్య కృష్ణమురళి ఆదివారం పరిశీలించారు. డిపోలో మౌలిక వసతులపై ఆరా తీశారు. డిపో నుంచి మద్యం ఎగుమతి, దిగుమతుల్లో ఇబ్బందులపై హమాలీలతో మాట్లాడారు. హమాలీల ఇన్సురెన్సు గురించి చర్చించారు.


రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్


గోకవరంలో వన సమారాధనకు హజరైన తూర్పు కాపులు


రాజానగరంలో ఆట పాటల్లో మహిళలు

వనసమారాధనలు ఐక్యతకు చిహ్నాలు

» పర్యాటక శాఖా మంత్రి దుర్గేష్
» పలు ప్రాంతాల్లో కార్తీక వనసమారాధనలు
» ఆట, పాటలతో సందడి చేసిన మహిళలు, చిన్నారులు

రాజానగరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగుస్తున్న నేపథ్యంలో ఆదివారం పలుచోట్ల వన సమారాధనల సందడి కానవచ్చింది. కులాలు, సంఘాలు వారీ ఎవరికి వారు వన భోజనాలు, ఆటపాటలతో ఉత్సాహం గా గడిపారు. దివాన్‌చెరువులోని పుష్కరవనం కార్తీక వన సమారాధనలతో కిక్కిరిసిపోయింది. జాతీయ రహదారి వెంబడి కార్లు, మోటారు సైకిళ్లు బారులు తీరాయి. అలాగే కాపునాడు ఆధ్వర్యంలో దివాన్‌చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన వన సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. రాజానగరంలోని ఆచంట సీతారామయ్య సామిల్లు ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆర్యవైశ్యులంతా కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో మహిళలు, చిన్నారులు ఆట, పాటలతో సందడి చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. దీనిలో భాగంగా సంఘ పెద్దలను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు గ్రంధి నానబ్బులు, మండలాధ్యక్షుడు మండవిల్లి వెంకన్నబాబు, కంకటాల సత్తిపండు, సముద్రాల రాంబాబు, దుర్గపు వసంతకుమార్, దవుళూరి శ్రీను, గిరిబాబు, కంకటాల రామకృష్ణ, కంకటాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ సంఘీయుల ఆధ్వర్యంలో..

రాజమహేంద్రవరం కల్చరల్ నవంబర్24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం చెరుకూరి గార్డెన్స్‌లో దేవాంగ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు రొబ్బి విజయశేఖర్ అధ్యక్షత కార్తీక వనసమారాధన జరిగింది. కాలెపు సత్యనారాయణమూర్తి శివ పార్వతులకు పూజలు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్ మాట్లాడుతూ పవిత్ర కార్తీక మాసంలో ఈ వనసమారాధన ద్వారా కలిసి ఐక్యతను చాటడం శుభసూచికమన్నారు. కార్యక్రమంలో కేకే సంజీవరావు, పుచ్చల రామకృష్ణ, గంపా సోమలింగేశ్వరరావు, ద్వారా పార్వతీసుందరి, బళ్ల శ్రీనివాసరావు, బత్తుల రాజేశ్వరరావు, బీరా శ్యామలరావు పాల్గొన్నారు.

శాలివాహనుల సంఘం ఆధ్వర్యంలో..

స్థానిక మోరంపూడిలోని జూపూడి వారి తోటలో జిల్లా కుమ్మర శాలివాహనుల వనసమారాధన నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా వచ్చిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కుమ్మర శాలివాహనులు సమాజ శ్రేయోభిలాషులని, వారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఫలాలు అందేటట్లు కృషి చేస్తానన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కుమ్మర్లకు అందే పథకాలకు ప్రాధాన్యమిస్తానన్నారు. కార్యక్రమంలో తుగ్గాలి నాగేంద్ర, కన్వీనర్ ఎంసత్యనారాయణ, డి.వేమన, పి.గంగాధరం, శేషారావు, టీవీ రావు, వై.అప్పారావు, పీవీ పెద్దిరాజు, కరుణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపు సంఘం ఆధ్వర్యంలో..

గోకవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తూర్పుకాపు వనసమారాధన గోకవరంలోని మామిడి తోటలో జరిగింది. ఉసిరి చెట్టు వద్ద సంఘ సభ్యులు పూజలు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైసీపీ నాయకుడు తోట రాంజీని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా లక్కీడిప్ నిర్వహించి 31 గ్రాముల వెండి వినాయక ప్రతిమను అందజేశారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతులు పది మందికి ఉచితంగా చీరలు పంపిణీ చేశారు.

సత్సంబంధాలు పెంపొందుతాయి: దుర్గేష్

నిడదవోలు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనలు ఐక్యతకు చిహ్నాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలు పట్టణం, మండలంలో జరిగిన కమ్మ సేవాసంఘం, శ్రీవాసవి ఆర్యవైశ్య సేవాసంఘం, తూర్పుకాపు విద్యావిజ్ఞాన అభివృద్ధి సంఘం, తూర్పుకాపు సంక్షేమ సంఘం, కాకతీయ సమైక్య సంఘం తదితర సంఘాలు వనసమారాధనలు నిర్వహించాయి. వాటికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ వనసమారాధనల్లో సహపంక్తి భోజనాల ద్వారా ఐకమత్యం, సత్సంబంధాలు,సంస్కృతీసాంప్రదాయాలు పెంపొందుతాయన్నారు. సమాజంలో అన్నివర్గాలు వారి రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, బూరుగపల్లి శ్రీనివాస్, కొమ్మిన వెంకటేశ్వరరావు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపు రాజమహేంద్రవరంలో రాజ్యాంగ దినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ రాజ్యాంగం రచించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 26న రాజమహేంద్రవరంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్నామని దళిత సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గోకవరం బస్టాండు సెంటర్‌లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని దళిత నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం 75వ రాజ్యాంగ దినోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అజ్జరపు రమేష్, మాలే విజయలక్ష్మి, తురకల నిర్మల పాల్గొన్నారు.

బిక్కవోలు సుబ్రహ్మణ్య షష్ఠి పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 7వ తేదీ నుంచి జరుగనున్న బిక్కవోలు సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకల పోస్టర్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం అనపర్తి ఎన్డీయే కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షష్ఠి ఉత్సవాల కమిటీ చైర్మన్ పల్లి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో షష్ఠి ఉత్సవాల ఆహ్వాన పత్రికను కూడా ఆవిష్కరించి మొదటి పత్రికను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ ఎంతో విశిష్టత కలిగిన బిక్కవోలు సుబ్రహ్మణ్య స్వామిని షష్ఠి సందర్భంగా దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు లక్షలాదిగా వస్తారని, వారికి అసౌకర్యం కలుగకుండా కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, రావాడ నాగు, గొర్రెల త్రిమూర్తులు, ఎస్.రామారావు, జంపా రమణ, చిటికన సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

కడియం, నవంబరు 24(ఆంధ్ర జ్యోతి) ఓటు నమోదు కార్యక్రమాన్ని తహశీల్దారు పోశిబాబు ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళా సమాఖ్య సభ్యులు, సిబ్బందితో అవగాహన ర్యాలీ చేపట్టారు. 2025 జనవరి 1 తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల లిస్టులో మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వెలుగు అధికారి నాగభూషణం, సీసీలు పద్మారావు, రాజబాబు, వీఏవోలు పాల్గొన్నారు.


నాగును సత్కరిస్తున్న సంఘ నాయకులు

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తులకు అభినందనలు

దివాన్‌చెరువు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యాదవ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులైన బత్తుల నాగేశ్వరరావు (నాగు)ను ఆదివారం పలువురు కలిసి అభినందించారు. తూర్పుగోదావరి జిల్లా చీఫ్ అండ్ గోట్ ఫెడరేషన్ చైర్మన్ గోగుల్ నర్సరీ మూర్తి, మాజీ చైర్మన్ రాజ్‌నాద్ సత్తిబాబు, కడియం, మురారి సంఘాల సభ్యులు ఆదివారం బత్తులను కలిసి సత్కరించారు.


మార్గానిని సత్కరిస్తున్న లయన్స్ క్లబ్

మార్గానికి లయన్స్ క్లబ్ ఉత్తమ సేవా పురస్కారం

కడియం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వీరహనుమాన్ నర్సరీ అధినేత, టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణను లయన్స్ క్లబ్ ఉత్తమ సేవా పురస్కారంతో సత్కరించారు. కడియపులంక వీరహనుమాన్ నర్సరీలో ఆదివారం ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ జిల్లా 316బి లయన్స్ ఇంటర్నేషనల్ మహిళలు 'కుమారి సంబవం' కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్ లయన్స్‌పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు, లయన్స్ జోన్ చైర్మెన్ కొయ్యన కుమారి, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మాటూరి మంగతాయారు నుంచి మార్గాని సత్యనారాయణకు జ్ఞాపిక అందజేశారు. వక్తలు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటంలో బాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించడం, కోట్లాది రూపాయల విలువైన భూమిని హరిహర క్షేత్రం దేవాలయాలకు దానం చేయడం పట్ల మార్గాని సత్యనారాయణను అభినందించారు. కార్యక్రమంలో అల్లడ కవిత, గొందేశీ మాధవీలత, అరుణకుమారి, పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రుడా చైర్మన్ బీవీఆర్ ప్రమాణ స్వీకారానికి
కూటమి శ్రేణుల పయనం


కార్యక్రమంలో మాట్లాడుతున్న రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి

రాజానగరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్‌గా నియమితులైన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ప్రమాణ స్వీకారానికి కూటమి శ్రేణులు బూరుగుపూడిలోని పార్టీ కార్యాలయానికి తరలివెళ్లారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, యనమల రామకృష్ణతో పాటుగా పరిసర నియోజక వర్గాల కూటమి శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం అధిక సంఖ్యలో వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కందుల బాబూరాయుడు, నాయకులు నూనె వెంకన్న, కందుల సత్యవతి తదితరులు ఉన్నారు.

• రుడా చైర్మన్‌కు అభినందన

కడియం: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరిని ఆదివారం మాధవరాయుడుపాలెం సర్పంచ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అన్నందేవుల చంటి, టీడీపీ పార్లమెంటరీ నాయకులు ప్రత్తిపాటి రామారావుచౌదరి కోరుకొండలో కలిశారు. పూలకిరీటం, గజమాల వేసి అభినందనలు తెలిపారు.

దారి పొడవునా గజమాలలతో అభినందనలు

కోరుకొండ: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు టీడీపీ రాజానగరం ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆదివారం బూరుగుపూడి గేటు టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బీజేపీ రాజానగరం ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి, టీడీపీ రాజానగరం నియోజకవర్గానికి చెందిన అనేక మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు బూరుగుపూడి పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని వెంకటరమణ చౌదరికి అభినందనలు తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ ప్రారంభానికి ముందు గాదరాడ సర్పంచ్ దూది కాంతారావు, పశ్చిమ గోనగూడెం సర్పంచ్ రొంగల శ్రీనివాసు, మాజీ సర్పంచ్ అడపా వీరబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగకేశవరావు, గంగిశెట్టి సత్తిబాబు, మాజీ జడ్పీటీసీ వలవల రాజా తదితరులు వెంకటరమణ చౌదరిని గజమాలతో అభినందించారు. రాజానగరం నియోజకవర్గం నుంచి వచ్చిన తెలుగు తమ్ముళ్ళు, జనసైనికులతో కలిసి ర్యాలీగా రాజమహేంద్రవరం చేరుకున్న చౌదరికి బూరుగుపూడి, మధురపూడి, నిడిగట్ల సెంటర్, గాడాల, పోలమూరు, కొత్తమూరు గ్రామాల్లో అభిమానులు స్వాగతం పలికారు. ర్యాలీ కారణంగా ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి పోలీసులు శ్రమపడాల్సి వచ్చింది.

ఎమ్మెల్యే నల్లమిల్లి శుభాకాంక్షలు

అనపర్తి: రుడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వెంకటరమణ చౌదరికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాజమహేంద్రవరంలో జరిగిన రుడా చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో కూటమి శ్రేణులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నల్లమిల్లి వెంట అనపర్తి నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతను భావిపౌరులుగా తీర్చిదిద్దడంలో
ఎన్‌సీసీ కీలకపాత్ర

రాజానగరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): యువతను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందని గైట్ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్ పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం జరిపారు. ఆయన మాట్లాడుతూ జాతీయ సమైక్యత సామాజిక ఐక్యతకు ఎన్‌సీసీ ప్రతిరూపంగా మారుతుందన్నారు. జీజీయు డీన్ ఎన్.లీలావతి మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఎన్‌సీసీ మరింత ముఖ్యమైందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఏఎన్‌వో తేజేశ్వరరాజు, డీన్ బి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సీసీ ఏఎన్‌వో తేజేశ్వరరాజు



బల్లిపాడులో గోదావరిలోకి దూసుకుపోయిన ట్రాక్టరు

తాళ్లపూడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లిపాడు రీచ్‌లో ఇసుక కోసం వచ్చిన ట్రాక్టరు గోదావరి నదిలోకి దూసుకుపోయింది. ఆదివారం ఇసుక కోసం వచ్చిన ఓ ట్రాక్టరును లైనులో ఉంచి డ్రైవర్.. వీఆర్వోకు లెటరు చూపడానికి వెళ్లిన సందర్భంలో రహదారి వాలుగా ఉండడంతో అదుపుతప్పిన ట్రాక్టరు దొర్లుకుంటూ గోదావరిలోకి దూసుకుపోయింది. ఆ సమయంలో ట్రాక్టర్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కడియం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కడియం ఉన్నత పాఠశాలలో 1982-83లో పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కడియపులంక గాంధీనర్సరీలో కలుసుకున్నారు. కార్తీక సమారాధన ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. తమతో పాటు చదువుకుని ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు పొందిన వర్ధనపు కృపావతికి పూలమాలలు, దుశ్శాలువా కప్పి, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో గట్టి నర్సయ్య, పాటంశెట్టి రవి, చిక్కాల సూరిబాబు, కటికరెడ్డి త్రిమూర్తులు, రంపం వెంకటేశ్వరరావు, కర్రి యోహాను, మార్ని తమ్మారావు, గుణ్ణం చిదానందం, మద్దుకూరి పోలరావు, సిరంశెట్టి అప్పారావు, గట్టి నాగేశ్వరరావు, పరిమి మూర్తివర్మ, ఎలిజిబెత్ రాణి, కృష్ణవేణి, సత్యవతి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.


ఉపాధ్యాయినిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



జన సమారాధనలు!

కార్తీకమాసం మూడో ఆదివారం వన సమారాధనలు జనంతో పోటెత్తాయి..ఎటు చూసినా సందడిగా మారాయి.. మహిళలు ఆటపాటలతో అలరించారు. - వివరాలు 8లో



జీవీఆర్ చౌదరి ర్యాలీలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు తదితరులు.. ఆనందంతో కుమారుడిని ముద్దాడుతున్న తల్లి జగన్మోహిని

రుడా అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

రుడా చైర్మన్‌గా ఆదివారం ఉదయం బొడ్డు వెంకటరమణ చౌదరి ప్రమాణ స్వీకారం చేశారు..ముందుగా కుటుంబంతో రుడా కార్యాలయానికి వెళ్లిన ఆయన అక్కడ ఫైల్‌పై సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు.. ఈ సందర్భంగా తల్లి జగన్మోహిని కుమారుడిని ముద్దు పెట్టుకుని అభినందించారు. అనంతరం బూరుగుపూడి చేరుకుని అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరారు. గ్రామగ్రామాన ఆయనకు ఘన స్వాగతం లభించింది.. కూటమి నాయకులు.. అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.. పూలవాన కురిపించారు.. ర్యాలీగా రాజమహేంద్రవరంలోని చెరుకూరి కల్యాణ మండపానికి చేరుకున్నారు.. మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు హాజరై పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు..

- 7,8లో

పంచాయతీల్లో అవినీతి!



ఇష్టానుసారంగా పోస్ట్ శాంక్షన్ ఆర్డర్స్

- వదలని మామూళ్ల మత్తు
- లంచమిస్తేనే జీతాలు
- 300 పంచాయతీల్లో ఇదీ తీరు
- జిల్లా సిబ్బంది 10 వేలు
- వసూళ్లు రూ.1.50 కోట్లు?
- కిందిస్థాయి సిబ్బంది గగ్గోలు
- ఇష్టానుసారం నియామకాలు
- అయినా పట్టని అధికారులు
- నేటికీ తేలని అసలు లెక్క

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేటికీ అంతా మా ఇష్టం అంటున్నారు..అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారే తప్ప..కనీసం కన్నెత్తి చూడడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు అవుతున్నా అధికారుల తీరు నేటికీ గత ప్రభుత్వంలో ఉన్నట్టే ఉన్నారు. తీరు మారలేదు.. అవినీతి ఆగలేదు. యథేచ్ఛగా దోపిడీ సాగుతూనే ఉంది. పంచాయతీల్లో ఇదీ మరీ ఎక్కువగా ఉంది. జిల్లాల విభజన జరిగినా అవినీతిని రూపుమాపడం.. అక్రమాలను అడ్డుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. పంచాయతీల్లో సిబ్బందికి పోస్ట్ శాంక్షన్ ఆర్డర్ లేకుండానే జీతాలు వెళ్లిపోతున్నా ఎందుకో మరీ నేటికీ ఏమీ తెలియనట్టు ఉన్నారు..

రెండేళ్లకోసారి దోపిడీ..

ఏ పంచాయతీలో అయినా పోస్ట్ శాంక్షన్ ఆర్డరు ఉంటేనే పంచాయతీ సిబ్బందికి జీతాలు చెల్లించాలి.ప్రతి రెండేళ్లకోసారి జిల్లా పంచాయతీ అధికారులు రెన్యువల్ చేస్తారు. జిల్లాలో చాలా పంచాయతీల్లో ఇవేమి లేకుండానే చెల్లింపులు చేస్తున్నారు.అయితే ఆర్డరు లేని సిబ్బంది తీరు ఇలా ఉంటే.. ఆర్డరు ఉన్న సిబ్బందీ ఆమ్యామ్యా చెల్లించాల్సిందే.ఆర్డరు రెన్యువల్ కావాలంటే ప్రతి కార్మికుడు(సిబ్బంది)రూ.1500 నుంచి రూ.3 వేల వరకు చెల్లించాలి. దీనిని బట్టే ప్రతి సంవత్సరం జీతాల పెంపుదల ఉంటుంది. ఒక యూనియన్ నాయకుడు సిబ్బంది వద్ద నుంచి వసూలు చేసి డీఎల్‌పీవో, జిల్లా పంచాయతీ అధికారి, కార్యాలయ సిబ్బందికి చెల్లిస్తారు. ఇదంతా ఆయా పంచాయతీ కార్యదర్శుల సిఫారసు మేరకే జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధిలోని ఒక పంచాయతీలో కార్యాలయ సిబ్బంది నుంచి రూ.1000, మిగిలిన పారిశుధ్య, తదితర సిబ్బంది వద్ద నుంచి రూ.3వేల వరకు సదరు కార్మిక నాయకులు వసూలు చేసినట్టు సమాచారం. జిల్లావ్యాప్తంగా 300 పంచా యతీల్లో సుమారు 10 వేల మంది పనిచేస్తున్నారు. సరాసరిన ఒక్కొక్కరి నుంచి రూ.1500 వసూలు చేసినట్టు లెక్కవేసినా రూ.1.50 కోట్లు అక్రమ వసూళ్లు సాగినట్టే. పోస్టు శాంక్షన్ వ్యవహారంలో సొమ్ములు వసూళ్లపై జిల్లా పంచా యతీ కార్యాలయం అధికారులను వివరణ కోరగా పొంతన లేని సమాధానం చెబుతున్నారు. డీపీవో ఫోన్ లోనూ అందుబాటులోకి రావడంలేదు.జిల్లాలోని 300 పంచాయతీల్లో ఎంత మంది పంచాయతీ కార్మికుల జీతాలకు సంబంధించి పోస్టుశాంక్షన్ ఆర్డర్లు ఇచ్చారన్న దానిపై మాటదాటవేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అధికారులు సిబ్బంది లెక్క తేల్చకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అవసరాలను బట్టి పంచాయతీలలో సిబ్బంది నియామకాలు చేపట్టవచ్చుగాని వారిని ఏ స్థానంలో నియమించారో ఆ స్థానంలో పనిచేయించాలి. ఎలాంటి క్వాలిఫికేషన్ లేకుండా, అర్హతతో సంబంధంలేకుండా పోస్టులను సృష్టించి అర్హత లేకపోయినా నియామకాలు చేపట్టారు. కొంత మంది అధికారులైతే సిబ్బందిని వ్యక్తిగత అవసరాలకు (డ్రైవర్లు)గా వాడుకుంటూ పంచా యతీ నుంచి సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు చెల్లించిన సంఘటనలు ఉన్నట్టు సమాచారం. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు.పంచాయతీ సిబ్బంది నివేదికలు బయటపెడితే పంచాయతీ అధికారుల అవకతవకలు బయటపడతాయని పలువురు మాజీ ప్రజాప్రతినిధులుబహిరంగంగానే చెబుతున్నారు

ఇష్టానుసారం ఇచ్చేసినా నివేదికల్లేవ్!

గత ప్రభుత్వంలో పంచాయతీల్లో అక్రమ నియామకాలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. పంచాయతీల్లో "ఇష్టానుసారం ఇచ్చేశారు" శీర్షికన ఈ నెల 8వ తేదీన "ఆంధ్రజ్యోతి"లో కథనం ప్రచురితమైంది. నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి నివేదిక పంపాలంటూ జిల్లా అధికారులను కోరారు. దీంతో జిల్లాలో ఉన్న పంచాయతీ సిబ్బంది సమాచారాన్ని సేకరిస్తున్నా రు. డీపీవో ఆదేశాల మేరకు సిబ్బంది పేరు, హోదా,విధుల్లో ఎప్పుడు చేరాడు, డీపీవో జారీ చేసిన జాయినింగ్ ఆర్డరు (పోస్ట్ శాంక్షన్ ఆర్డర్) ఉందా,ఎంత జీతం తీసుకుంటున్నాడు, సీఎఫ్ ఎంఎస్ ఐడీ, ఫోన్ నంబరు తదితర అంశాలతో కూడిన సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శుల నుంచి ఈవోపీఆర్డీ సేకరిస్తున్నారు. గత 10 రోజులుగా వివరాలు సేకరిస్తున్నాం అంటున్నారే తప్ప నివేదికను బయటకు ఇవ్వడం లేదు. పంచాయతీల నుంచి నివేదికలు తీసుకున్నామని ఈ నివేదిక బయటకు ఇవ్వడానికి వీల్లేదని నేరుగా జిల్లా కలెక్టరుకు సమర్పించామని రూరల్ మండల పంచాయతీ విస్తర్ణాధికారి ఆర్మ్‌స్ట్రాంగ్ చెబుతున్నారు.

పల్లెకు పండుగేది!

ఇదీ పెరవలి మండలం కానూరు అగ్రహారంలో సీసీ రోడ్డు.. పనులు సాగుతూనే ఉన్నాయి.. ఏదో చేశామా అన్నట్టు చేస్తున్నారు.. ఎంత నాణ్యతగా ఉందనేది అధికారులు పరిశీలించరు.. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. పల్లె పండుగ పనులపై ఒకసారి ఉన్నతాధికారుల దృష్టి పడాల్సిందే మరి..



కనిపించేదంతా నిజం కాదు... అలాగని చెబుతున్న మాటలు నిజం కాదు.. దీనికి ఇదే ఉదాహరణ. పల్లె పండుగ కార్యక్రమాన్ని గత నెల 2వ తేదీన అట్టహాసంగా ప్రారంభించారు.. గ్రామాల్లో డ్రెయినేజీలు.. సీసీ రోడ్ల అభివృద్ధి పథకం లక్ష్యం.. అయితే అధికారుల లెక్కల ప్రకారం అన్ని చోట్లా పనులు ఆరంభమైపోయాయి.. అయితే క్షేత్రస్థాయిలో చూస్తే మాత్రం చాలా చోట్ల ఇంకా ఆరంభమే కాలేదు. పోనీ ఆరంభమైన చోటయినా వేగంగా సాగుతున్నాయా అంటే అదీ లేదు.. అక్కడా నత్తనడకే.. ఇలా చేస్తే సంక్రాంతికి పనులు పూర్తవడం ప్రశ్నార్థకమే.

నత్తనడకన సా..గుతున్న పనులు

- అరకొరగా ఆరంభం
- జిల్లాకు 651 పనులు మంజూరు
- ముందుకు సాగని డ్రైనేజీ నిర్మాణాలు
- రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం
- లెక్కల్లో చూస్తే ఆరంభం
- క్షేత్రస్థాయిలో చూస్తే వెనుకడుగే
- కిందిస్థాయి అధికారుల అలసత్వం
- పనుల్లో వెనుకబడిన తాళ్ళపూడి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి) సంక్రాంతి పండగ నాటికి పల్లెలన్నీ సీసీ రోడ్లతో కళకళలాడాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంపై అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులు నత్తనడక సాగుతున్నాయి. ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఒకే రోజు గ్రామసభలు నిర్వహించి పనులకు తీర్మానాలు కూడా చేయించిన సంగతి తెలిసిందే. తర్వాత సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో అక్టోబరు 2 నుంచి పల్లె పండగ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పల్లెల్లోకి వెళ్లి గ్రామసభల్లో తీర్మానం చేసిన పలు పనులకు శంకుస్థాపనలు కూడా చేసిన సంగతి తెలిసిందే. ఇవన్నీ సంక్రాంతి నాటికి పూర్తి కావాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడంలేదు. కొన్ని చోట్ల మొదలైన పనులు వేగవంతంగా జరుగుతుంటే, కొన్ని ప్రాంతాల్లో అసలు ఆరంభమే కాలేదు. కొన్ని సీసీ రోడ్ల నిర్మాణం సాగుతుంటే, ఇంకొన్ని చోట్ల ఇంకా శంకుస్థాపన కూడా చెయ్యని పరిస్థితి. కానీ తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నిత్యం వెంటాడుతున్నారు. పనులు వేగవంతం చేయాలని, డిసెంబరు చివరికి పూర్తి చేయాలని ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు చొరవ చూపుతున్నా కొన్ని సమస్యలు అడ్డంకిగా మారాయి. ఇసుక కొరత ఉంది. పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఇప్పటికే ఎంత ఇసుక కావాలనే ప్రతిపాదన సిద్ధమైంది.కానీ ఇంత వరకు ఎవరు ఏ ర్యాంపు నుంచి ఇసుక తెచ్చుకోవాలనే దానిపై స్పష్టత లేదు. పైగా పరోక్షంగా నామినేషన్ పద్ధతిలో ఈ పనులను ప్రజాప్రతినిధులు... పార్టీ కార్యకర్తలతోనే చేయిస్తున్నారు. కొందరు ముందుగా పెట్టుబడి పెట్టడానికి చొరవ చూపకపోవడం మరో కారణం. కార్యకర్తలు ఓ కాంట్రాక్టరుకు పనులు అప్పగించడం వల్ల ఒక పని తర్వాత మరొకటి చేసుకోవచ్చనే ధోరణి వల్ల కూడా సమస్య ఉంది. అన్ని గ్రామాల్లో ఒకేసారి మొదలైతే డిసెంబరు చివరి వరకూ కూడా అవసరం ఉండదు. క్షేత్ర స్థాయిలో అటువంటి పరిస్థితి లేదు.

జిల్లాకు 651 పనులు..

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు మొత్తం 651 పనులు మంజూరయ్యాయి.అవన్నీ సీసీ డ్రెయిన్లే. పంచాయతీరాజ్ శాఖ ద్వారా జరుగుతున్నాయి. గ్రామీణ మంచినీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్) విభాగం ద్వారా రూ.30 కోట్ల విలువైన 100కు పైగా డ్రైన్లు శాంక్షన్ చేశారు. కానీ సాంకేతిక కారణాలతో పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఇక పల్లె పండుగలో భాగంగా ప్రతి గ్రామంలోనూ సీసీ రోడ్లు నిర్మించాలన్నది లక్ష్యం. ప్రాధాన్యతను బట్టి పనులు కేటాయించారు. మొత్తం జిల్లాలో 130 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేయనున్నారు. ఒక్కో కిలో మీటరుకు రూ.50 లక్షల వరకు అంచనా వేశారు. ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం 12.5 అడుగుల రోడ్డు నిర్మించాలి.ఇంకా 1నుంచి 3శాతం వరకు ప్రజాప్రతినిధులు, ప్రజల కోరిక మేరకు నిర్మించవచ్చు. ఏడు అంగుళాల నుంచి 8 అంగుళాల మందం ఉండేలా చూడాలి.కానీ ఈ పనులన్నీ నామినేషన్ పద్ధతిలో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నేతలే చేస్తున్నట్టు సమాచారం.కార్యకర్తల పేర్లతో కాంట్రాక్టర్లు కూడా పనులు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. అనపర్తిలో 50 వర్కులు శాంక్షన్ అయ్యాయి. పనుల నిర్మాణం మొదలైనట్టు అధికారుల లెక్కలు చెప్తున్నాయి. కానీ చాలా పనులు మొదలు కాలేదు.కొన్నింటికి శంకు స్థాపన చేయలేదు. కొన్ని పనులకు సంబంధించి రోడ్లను శుభ్రం చేశారు. కొంత మట్టి వర్కు చేశారు. కంకర లేయర్లు వేశారు. కొన్నిచోట్ల సీసీ రోడ్లు వేశారు. కొన్నిచోట్ల ఆల్టర్నేట్ రోడ్లను ప్రతిపాదించారు. గోపాలపురంలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. కడియంలో నిర్మించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో నాలుగు వర్కులు పూర్తయ్యాయి. పెరవలిలో రెండు గ్రామాల్లో జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం రూరల్‌లో 92 వర్కుల్లో 74 వర్కులే మొదలు కానున్నాయి. మిగతా వర్కులకు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలకు పంపినట్టు సమాచారం.

అధికారుల కాగితాల్లో లెక్కలు

అధికారుల లెక్కల ప్రకారం మండలాల వారీగా..కడియంలో 7 పనులకు అన్నీ మొదలయ్యాయి.కోరుకొండలో 18, రాజమహేంద్రవరం రూరల్‌లో 92 వర్కులకు 74, రాజానగరంలో 32 శాంక్షన్ కాగా అన్నీ మొదలయ్యాయి. రంగం పేటలో 44కి 43, బిక్కవోలులో 70కి 68, ఉండ్రాజవరంలో 54కి 52, గోకవరంలో 48కి 46, నిడదవోలులో 84కి 79, నల్లజర్లలో 38 కి 35, గోపాలపురంలో 12కి 11, చాగల్లులో 9కి 7, పెరవలిలో 42కి 32, దేవరపల్లిలో 18కి 13, కొవ్వూరులో 10కి 13, తాళ్లపూడిలో 17కి7 పనులు మొదలయ్యాయి. సీతానగరం మండలంలో ఒకే ఒక్క పని మంజూరు కాగా ఇంకా మొదలు కాలేదు. తాళ్లపూడి మండలం బాగా వెనుకబడి ఉంది.

పనుల్లో నిర్లక్ష్యం

ఇదీ గోపాలపురం గ్రామంలో వేస్తున్న రోడ్డు.. కనీసం రోడ్డు వెడల్పు చేయకుండా ఇష్టానుసారం వేసేస్తున్నారు.. పక్కనే ఉన్న మొక్కలు తీసి రోడ్డు వెడల్పు చేస్తే బాగుండేది.. కానీ పాత రోడ్డు ఎంత ఉందో అంతే వేశారు.. ఇలా గ్రామాల్లో అభివృద్ధికి నిధులు విడుదల చేసినా పనులు మాత్రం నిర్లక్ష్యంగా సాగుతున్నాయి..అయినా పట్టించుకునేవారే లేరు.. క్వాలిటీ కంట్రోల్ అధికారులు 20 రోజుల తరువాత చూస్తారట..



చంటి బిడ్డ మృతి.. బంధువుల ఆందోళన

రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రిలో ఘటన

చాగల్లు ఐఎంఎల్ డిపో పరిశీలన

డిపోలో మౌలిక వసతులపై ఆరా

8

పెళ్లయిన రెండేళ్లకే వివాహిత మృతి

అనుమానాస్పద మృతిగా కేసు

గోపాలపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. సద్గొండ గ్రామ పరిధిలో ఉన్న గోపవరం గ్రామానికి చెందిన అన్నెం వీర హారిక అదే గ్రామానికి చెందిన వరుసకు బావ అయిన అన్నెం మోషేను రెండేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకుంది. ఈ దంపతులకు ఏడాది పాప ఉంది. ఆదివారం ఉదయం ఎంత సేపటికి ఇంట్లో నుంచి హారిక బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వారికి అనుమానం వచ్చి తలుపులు తీయగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయినట్టు గుర్తించారు. ఇటీవల పుట్టింటి వారు ఆమెను పట్టించుకోవడంలేదని మనోవేదనకు గురై శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చీర పాల్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు చెబుతున్నారు. మండల తహశీల్దార్ సీహెచ్.విద్యాపతి ఆదివారం శవ పంచనామా చేశారు. మృతురాలి తల్లి పేరం దుర్గ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



నిడదవోలులో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ ర్యాలీలో టీచర్ల నినాదాలు

టీచర్లు నిరంతర అధ్యయనం చేయాలి

యూటీఎఫ్ కౌన్సిల్ స్వర్ణోత్సవ సభలో ఎమ్మెల్సీ ఐవీఆర్

నిడదవోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నవ సమాజాన్ని నిర్మించే పౌరులను తయారు చేయాలంటే ఉపాధ్యాయులు అభ్యుదయంగా ఆలోచిస్తూ సాంకేతిక దృక్పథంతో బోధించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు అన్నారు. నిడదవోలు లయన్స్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ నూతన కౌన్సిల్ స్వర్ణోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రతి విషయంపై నిరంతర అధ్యయనం చేయాలన్నారు. 50 ఏళ్ళ యూటీఎఫ్ ఉద్యమ చరిత్రలో ఎన్నో విజయాలు ఉన్నాయన్నారు. విద్యార్థులపై పనిగంటల పెంపు భారాన్ని విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బీ గోపి మూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ హక్కులు బాధ్యతలు యూటీఎఫ్ సంఘానికి రెండు కళ్లు అన్నారు.యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ మాట్లాడుతూ కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.విజేతలైన ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏ షరీఫ్, కె.వేంకటేశ్వరరావు, పార్థసారథి, ఈవీవీఎస్ ప్రసాద్, శంకరుడు, ఎం.విజయగౌరి, ఐ.రాంబాబు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి: పీడీఎస్‌యూ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్‌కు ఎదురు చూస్తున్నారన్నారు.


నిడదవోలులో మంత్రి దుర్గేష్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు


కొవ్వూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి


రాజానగరంలో ఆట పాటల్లో మహిళలు

వనసమారాధనలు ఐక్యతకు చిహ్నాలు

- పర్యాటక శాఖా మంత్రి దుర్గేష్
- పలు ప్రాంతాల్లో కార్తీక వనసమారాధనలు
- ఆట, పాటలతో సందడి చేసిన మహిళలు, చిన్నారులు

రాజానగరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగుస్తున్న నేపథ్యంలో ఆదివారం పలుచోట్ల వన సమారాధనల సందడి కానవచ్చింది. కులాలు, సంఘాలు వారీ ఎవరికి వారు వన భోజనాలు, ఆటపాటలతో ఉత్సాహం గా గడిపారు. దివాన్‌చెరువులోని పుష్కరవనం కార్తీక వన సమారాధనలతో కిక్కిరిసిపోయింది. జాతీయ రహదారి వెంబడి కార్లు, మోటారు సైకిళ్లు బారులు తీరాయి. అలాగే కాపునాడు ఆధ్వర్యంలో దివాన్‌చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన వన సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. రాజానగరంలోని ఆచంట సీతారామయ్య సామిల్లు ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆర్యవైశ్యులంతా కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో మహిళలు, చిన్నారులు ఆట, పాటలతో సందడి చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. దీనిలో భాగంగా సంఘ పెద్దలను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు గ్రంధి నానబ్బులు, మండలాధ్యక్షుడు మండవిల్లి వెంకన్నబాబు, కంకటాల సత్తిపండు, సముద్రాల రాంబాబు, దుర్గపు వసంతకుమార్, దవులూరి శ్రీను, గిరిబాబు, కంకటాల రామకృష్ణ, కంకటాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ సంఘీయుల ఆధ్వర్యంలో..

రాజమహేంద్రవరం కల్చరల్ నవంబర్24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం చెరుకూరి గార్డెన్స్ లో దేవాంగ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు రొబ్బి విజయశేఖర్ అధ్యక్షత కార్తీక వనసమారాధన జరిగింది. కాలెపు సత్యనారాయణమూర్తి శివ పార్వతులకు పూజలు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్ మాట్లాడుతూ పవిత్ర కార్తీక మాసంలో ఈ వనసమారాధన ద్వారా కలిసి ఐక్యతను చాటడం శుభసూచికమన్నారు. కార్యక్రమంలో కేకే సంజీవరావు, పుచ్చల రామకృష్ణ, గంపా సోమలింగేశ్వరరావు, ద్వారా పార్వతీసుందరి, బళ్ల శ్రీనివాసరావు, బత్తుల రాజేశ్వరరావు, బీరా శ్యామలరావు పాల్గొన్నారు.

శాలివాహనుల సంఘం ఆధ్వర్యంలో..

స్థానిక మోరంపూడిలోని జూపూడి వారి తోటలో జిల్లా కుమ్మర శాలివాహనుల వనసమారాధన నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా వచ్చిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కుమ్మర శాలివాహనులు సమాజ శ్రేయోభిలాషులని, వారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఫలాలు అందేటట్లు కృషి చేస్తానన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కుమ్మర్లకు అందే పథకాలకు ప్రాధాన్యమిస్తానన్నారు. కార్యక్రమంలో తుగ్గాలి నాగేంద్ర, కన్వీనర్ ఎంసత్యనారాయణ, డి.వేమన, పి.గంగాధరం, శేషారావు, టీవీ రావు, వై.అప్పారావు, పీవీ పెద్దిరాజు, కరుణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని తెలికిచర్లలో రైతు తమ్మిశెట్టి రామారావు, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో వన భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భద్రావతి భావనారాయణల కళ్యాణం, రమాసత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. బంధుమిత్రులు, గ్రామస్థులు హాజరయ్యారు. అలాగే దూబచర్ల, పోతవరం, పోతినీడు పాలెం గ్రామాల్లో వన సమారాధనలు జరిగాయి.

కొవ్వూరు: స్థానిక అవంతీ ఫ్యాక్టరీ 2వ యూనిట్ సమీపంలోని రైల్వేట్రాక్ ప్రక్కన కోడూరి గంగరాజు తోటలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. గంగరాజు దంపతులు ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, పరిమి హరిచరణ్, అల్లూరి విక్రమాదిత్య, పరిమి గెరట మోహనరావు, సూరపనేని చిన్న, సూర్యదేవర రంజిత్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, యూవీఎస్ నారాయణ పాల్గొన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ వన సమారాధనలతో ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మద్దిపాటి సత్యనారాయణ, మద్దిపట్ల సురేష్, కంటమణి కిషోర్, మల్లిన గోపి, టేకు సత్యనారాయణ, కంటమణి రమేష్ పాల్గొన్నారు. అలాగే డీఏవీ స్కూల్ సమీపంలో ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది.


నల్లజర్ల: తెలికిచర్లలో ఉసిరి చెట్టు వద్ద పూజలు


రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

సత్సంబంధాలు పెంపొందుతాయి: దుర్గేష్

నిడదవోలు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనలు ఐక్యతకు చిహ్నాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలు పట్టణం, మండలంలో జరిగిన కమ్మ సేవా సంఘం, శ్రీవాసవి ఆర్యవైశ్య సేవాసంఘం, తూర్పుకాపు విద్యావిజ్ఞాన అభివృద్ధి సంఘం, తూర్పుకాపు సంక్షేమ సంఘం, కాకతీయ సమైక్య సంఘం తదితర సంఘాలు కార్తీక వనసమారాధనలు నిర్వహించాయి. వాటికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ వనసమారాధనల్లో సహపంక్తి భోజనాల ద్వారా ఐకమత్యం, సత్సంబంధాలు, సంస్కృతీసాంప్రదాయాలు పెంపొందుతాయని అన్నారు. సమాజంలో అన్ని వర్గాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, బూరుగపల్లి శ్రీనివాస్, కొమ్మిన వెంకటేశ్వరరావు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఉండ్రాజవరం జడ్పీ హైస్కూల్ 1979-80 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

ఉండ్రాజవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో 1979-80 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండలంలోని మోర్త గ్రామంలో జరిగింది. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చదువుకున్న రోజుల్లో అల్లరి చేష్టలను,మధుర క్షణాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన పూర్వ ఉపాధ్యాయులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా విందును ఆరగించారు. రోజంతా సంతోషంగా గడిపారు.

బీజేపీ నాయకుల సంబరాలు


నిడదవోలులో బీజేపీ నాయకులు సంబరాలు

కొవ్వూరు: కొవ్వూరులో పరిమి రామారాయుడు రత్తమ్మ కళ్యాణ మండపంలో బీజేపీ నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్స్ పంచారు. మహారాష్ట్రలో బీజేపీ పోటీ చేసిన 148 స్థానాలకు 132 స్థానాల్లో విజయం సాధించడానికి కార్యకర్తల కృషే కారణమన్నారు. ఏపీలోను పార్టీ బలోపేతానికి మరింత కష్టపడదామన్నారు. కార్యక్రమంలో పిక్కి నాగేంద్ర, మాట్ల ఆంజనేయులు, పెరుగు పోతురాజు, సురేష్, రామకృష్ణ, భాస్కరరావు, శివకృష్ణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ అఖండ మెజారిటీతో విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు ఆదివారం నిడదవోలులో సంబరాలు జరిపారు. స్థానిక గణేష్ ఆలయం వద్ద ప్రత్యేకపూజలు చేసి బాణసంచా కాల్చి, కేకు కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో నాయకులు నీలం రామారావు, బండి సత్యనారాయణ, గవిరి వీర్రాజు, అచ్చెయ్య, రాజేశ్వరరావు, కుడుపూడి నరేష్, బలిజేపల్లి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.


కొవ్వూరులో కేక్ కట్‌చేస్తున్న బీజేపీ నాయకులు

పార్డ్ ఇండియాతో మరిన్ని సేవలు

నల్లజర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పార్డ్ ఇండియా సేవ సంస్థ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు చేసేందుకు కృషి చేస్తున్నట్టు సంస్థ మండలాధ్యక్షుడు మహ్మద్ షరీఫ్ అన్నారు. ఆదివారం నల్లజర్ల ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ కార్యక్రమం విజయవంతం కావడం ఆనందదాయకమన్నారు. ప్రస్తుతం బడి తరువాత విద్యా బోధన కార్యక్రమం మూడు గ్రామాల్లో జరుగుతుందన్నారు. జాతీయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో అంబులెన్స్, ఫ్రీజర్ కైలాస రథం ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రంలో బొందల శ్రీనివాసరావు, గోతం సత్యలక్ష్మి, జీవీవీ ప్రసాద్, కూరపాటి నాగరాజు పాల్గొన్నారు.

రుడా చైర్మన్‌కు సువర్ణరాజు అభినందనలు


బీవీఆర్ చౌదరికి అభినందనలు తెలుపుతున్న జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు

దేవరపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బొడ్డు వెంకటరమణ చౌదరిని ఆదివారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ రుడా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో అన్ని గ్రామాలబివృద్ధికి కృషి చేయాలని కోరినట్టు చెప్పారు. ప్రజానాయకుడిగా పేరొందిన ఆయన ఆధ్వర్యంలో రుడా పరిధిలోని గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అనిశెట్టి గంగరాజు, రాగూర్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదుకు 120 దరఖాస్తులు

తాళ్లపూడి తహశీల్దార్ రవీంద్రనాథ్

తాళ్లపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) రెండు రోజుల పాటు జరిగిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో మొత్తం 120 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ తెలి పారు. ఆదివారం మండలంలోని 20 పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. డిసెంబరు 5న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మొత్తం 61 మంది టీచరు ఓట్లు నమోదయ్యాయని తెలిపారు.మండలంలో 1746 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకున్నారని, ఇప్పటివరకు నమోదు కాని గ్రాడ్యుయేట్లు డిసెంబరు 8వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు తమ పేర్లు సరిగా ఉన్నవో లేదో సరిచూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, బీఎల్‌వోలు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.


పెద్దేవంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

97దరఖాస్తుల స్వీకరణ

నల్లజర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల వద్ద మొత్తం 97మంది ఓటు హక్కు మార్పులు చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్నట్టు తహశీల్దార్ కృష్ణారావు తెలిపారు. మొదటి రోజు 46మంది దరఖాస్తు చేసుకోగా ఆదివారం 53మంది దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. వీఆర్వోలు, బీఎల్‌వోలు ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉన్నారన్నారు.


నల్లజర్ల పోలింగ్ బూత్ వద్ద తహశీల్దార్ కృష్ణారావుతో సిబ్బంది

108 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



చాగల్లు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమే 108 సేవలను నిర్వహించాలని, వారి సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది కోరారు. స్థానికంగా సిబ్బంది పర్యటించి ప్రజలకు కరపత్రాలు పంచుతూ వారి మద్దతు కోరారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు శివనాగేశ్వరరావు, శ్రీధర్, రమేష్ నాయుడు, సతీష్‌లు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. 108 సేవలను ప్రభుత్వమే నిర్వహిస్తే సిబ్బందితో పాటు ప్రభుత్వానికి మంచి జరుగుతుందన్నారు.

అలరించిన సంగీత నవావధానం

రాజమహేంద్రవరం కల్చరల్ నవంబర్24 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ ఘాట్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన సంగీత అవధానం శ్రోతలను ఆకట్టుకుంది. ప్రసంగ తరింగిణి 34వ వార్షికోత్సవం, సంస్థ 244వ సాహిత్య కార్యక్రమం శీమకుర్తి రామరాజు, సుశీలమ్మ దంపతుల స్మారకార్థం నవావధాని మీగడ రామలింగ స్వామి సంగీత అవధానం చేశారు. ప్రబల సుబ్రహ్మణ్యశర్మ సంధాతగా వ్యవహరించారు. ఆర్‌వీవీ.గోపాలాచార్యులు, జోరాశర్మ, శ్రీపాద సీతామహలక్ష్మి, నూజిళ్ళ సూరిబాబు, సవితాల సుబ్రహ్మణ్య శర్మ, బీహెచ్ రమాదేవి, ప్రభల శ్రీవల్లులు, వివిధ సంగీత, సాహిత్య ప్రక్రియల్లో తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించి సంగీత ప్రియులను పరవశింపజేశారు. దువ్వూరి పార్వతి మల్లికార్జునరావు ప్రార్థన చేశారు. జ్ఞాన సరస్వతి పీఠం తరపున తోట సుబ్బారావు సత్కరించారు. కార్యక్రమంలో బిక్కిన రామమనోహర్, బత్తుల సాయిబాబు, కాల్నాభట్ల సత్యనారాయణ, డీవీ.హనుమంతరావు దంపతులు పాల్గొన్నారు.

రుడా అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- రానున్న 40 ఏళ్లు దృష్టిలో పెట్టుకుని చేస్తా
- గత అక్రమాలపై దృష్టిపెడతా
- రుడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారంలో బీవీఆర్ చౌదరి


కార్యక్రమంలో మాట్లాడుతున్న రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రానున్న 40 ఏళ్లలో రాజమహేంద్రవరం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించడమే నా ప్రధాన లక్ష్యమని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం చెరుకూరి కళ్యాణ మండపంలో ఆదివారం రుడా చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. తొలుత బీవీఆర్ చౌదరి తండ్రి బొడ్డు భాస్కరరామారావు చిత్రపటానికి పూలమాల వేసి బొడ్డు కుటుంబీకులు తల్లి జగన్నోహిని, సతీమణి సురేఖ, ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. అనంతరం బీవీఆర్ మాట్లాడుతూ నాకు రుడా చైర్మన్ పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. రాజానగరం టీడీపీ శ్రేణుల వల్లనే తనకు ఈ పదవి వచ్చిందన్నారు. అభివృద్ధిలో సమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. రాజమహేంద్రవరం నగరం వేగంగా అభివృద్ధి చెందుతూ ఉన్నతంగా ఉండాలన్నారు. ఇందులో తమవంతు పాత్ర పోషిస్తామన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు ఇప్పటికే అధికారులతో సమాలోచన చేస్తున్నామన్నారు. రుడా పరంగా కొత్త ప్రాజెక్టులు వస్తాయన్నారు.రుడా నుంచి అభివృద్ధి వైపు కార్యకలాపాలు నిర్వహిస్తూనే మరో వైపు గత పాలకుల అవినీతి అక్రమాలపై దృష్టిపెడతామన్నారు. అందరి సహకారం సమన్వయంతో ముందుకు సాగుతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి సౌమ్యులని కానీ గత పాలకుల లెక్కలు తేలుస్తారని చెప్పారు. కూటమిలో చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నప్పటికి తామంతా చంద్రబాబు కోసం రాష్ట్ర శ్రేయస్సు కోసం తగ్గి కలిసికట్టుగా వెళతామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ హాజరై అభినందనలు తెలిపారు. తొలుత బొడ్డుకు ఆదిరెడ్డి వాసు పెయింటింగ్ బహూకరించారు. తొలుతు బొడ్డు వెంకటరమణ చౌదరి రాజానగరం నియోజకవర్గం నుంచి భారీ ఊరేగింపు నిర్వహించారు. రూరల్ గ్రామాల గుండా రాజమహేంద్రవరం చేరుకున్నారు. బొడ్డుకు ఆయా గ్రామాల్లో ఘన స్వాగతం పలికారు. అనంతరం భారీ స్థాయిలో చెరుకూరి కళ్యాణ మండపానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిరాజు, నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, మాజీ మంత్రి పీతల సుజాత , టీడీపీ సీనియర్ నేత గన్నికృష్ణ, నీరుకొండ వీరన్నచౌదరి, మాజీ ఎమ్మెల్యే న్నంబాబు రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జనసేన రాజమహేంద్రవరం ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, ఇతర ముఖ్యనాయకులు బొడ్డుకు అభినందనలు తెలిపారు.


బీవీఆర్ చౌదరి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

ఐఎంఎల్ డిపో పరిశీలన

చాగల్లు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చాగల్లులోని ఏపీఎస్‌బీసీఎల్ ఐఎంఎల్ డిపోను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ (కాకినాడ) చైతన్య కృష్ణమురళి ఆదివారం పరిశీలించారు. డిపోలో మౌలిక వసతులపై ఆరా తీశారు. డిపో నుంచి మద్యం ఎగుమతి, దిగుమతుల్లో ఇబ్బందులపై హమాలీలతో మాట్లాడారు. హమాలీల ఇన్సురెన్సు గురించి చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వెంట డిపో మేనేజర్ రామకృష్ణదాస్ తదితరులున్నారు.

టీడీపీ నాయకుడు శేషగిరిరావు మృతి

తాళ్లపూడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లిపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ప్లభని శేషగిరిరావు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పార్థివదేహానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, నామన పరమేశ్వరరావు, అన్నమరెడ్డి సత్తిబాబు, కైగాల రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బల్లిపాడులో గోదావరిలోకి దూసుకుపోయిన ట్రాక్టరు



తాళ్లపూడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లిపాడు రీచ్‌లో ఇసుక కోసం వచ్చిన ట్రాక్టరు గోదావరి నదిలోకి దూసుకుపోయింది. ఆదివారం ఇసుక కోసం వచ్చిన ఓ ట్రాక్టరును లైనులో ఉంచి డ్రైవర్.. వీఆర్వోకు లెటరు చూపడానికి వెళ్లిన సందర్భంలో రహదారి వాలుగా ఉండడంతో అదుపుతప్పిన ట్రాక్టరు దొర్లుకుంటూ గోదావరిలోకి దూసుకుపోయింది. ఆ సమయంలో ట్రాక్టర్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

నల్లజర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో మారెళ్లమూడిలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి రూ.3 వేల నగదు సీజ్ చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సోమరాజు ఆదివారం తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

కోటసత్తెమ్మకు పూజలు



నిడదవోలు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ తల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి విశేష దర్శనం, నిత్యదర్శనం చేపట్టారు. అమ్మవారికి క్షీర నివేదన, మహానివేదన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కోడిపందాల శిబిరంపై పోలీసుల దాడి

గోపాలపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగిపాడు గ్రామ శివారులో కోడిపందాలు జరుగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు ఆదివారం దాడి చేశారు. కోడిపందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడిపుంజులు, రెండు కోడికత్తులు, రూ.3,400 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

దేవరపల్లిలో జ్యోతిర్లింగార్చన


దేవరపల్లి శివాలయంలో జ్యోతిలింగార్చనలో పాల్గొన్న భక్తులు

దేవరపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో పార్వతి సమేత ఉమారామలింగేశ్వర ఆలయంలో స్వాముల లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమపూజలు, మారేడు దళాలతో లక్షపత్రిపూజ, జ్యోతిర్లింగార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని కార్తీకదీపాలు వెలిగించారు. రావులపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాస అవధాని ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాంబాబు, కోలా రంగారావు, పైడికొండలు శివయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వనసమారాధనలు

ఉండ్రాజవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కార్తీక వనసమారాధనలు ఆనందోత్సాహాల న డుమ జరిగాయి. ఈ సందర్భంగా కార్తీక పూ జలు జరిపారు. పాలంగిలో దుర్గాశెట్టి బలిజ సంక్షేమ సంఘం, కరికాల భక్తుల సంక్షేమ సంఘం, విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యాల్లో వనసమారాధనలు నిర్వహించారు. మహిళలు, పిల్లలకు వివిధ పోటీలు జరిపి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఉండ్రాజవరంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక పూజలు నిర్వహించారు. ఉండ్రాజవరం, మోర్త, చివటం, సత్యవాడ, తాడిపర్రు, దమ్మెన్ను తదితర గ్రామాల్లో వనసమారాధనలు సందడిగా నిర్వహించారు.

చంటిబిడ్డ మృతిపై బంధువుల ఆందోళన

రాజమహేంద్రవరం సిటీనవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నందం గనిరాజు సెంటర్ సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చంటిబిడ్డ మృతి చెందిన సంఘటనపై బాధిత బంధువులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే ఏలేశ్వరం పెద్దవీధికి చెందిన బండి లక్ష్మణ్ భార్య డెలివరీ నిమిత్తం అక్టోబరు 30న ఆసుపత్రిలో చేరింది. ఆమెకు కవల పిల్లలు పుట్టారు. ఇద్దరిలో ఒక పాపకు ఆరోగ్యం బాగోలేదని.. అప్పట్నుంచి ఎన్ఐసీయూలో పెట్టి చికిత్స అందిస్తున్నారు. అయితే శనివారం రాత్రి బేబి మృతి చెందిందని వైద్యులు చెప్పడంతో లక్ష్మణ్ ఆవేదనతో ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగాడు. తమవల్ల కాదు అంటే వేరొక హాస్పటల్‌కు పాపను తీసుకువెళ్లి చికిత్స చేయించుకునేవారమని.. చెప్పకుండా చంపేశారని ఆసుపత్రి వర్గాల తీరుపై మండిపడ్డారు. అటుపై బేబి మృతదేహాన్ని తీసుకుని వెళ్లిపోయారు.


ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు